## మంత్రి ఉత్తమ్‌ను పరామర్శించిన ఎర్రబెల్లి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, సెప్టెంబర్ 30: రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సోమవారం ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు వారి కుటుంబసభ్యులను కలిసి పరామర్శించారు. పురుషోత్తంరెడ్డికి మృతికి సంతాపం తెలిపారు.

## మల్టీపర్పస్ వర్కర్లకు ఐదు రోజుల శిక్షణ

బచ్చన్నపేట, సెప్టెంబర్ 30 : మండలంలోని అన్ని గ్రామాల్లోని మంచినీటిని సరఫరా చేస్తున్న సహాయకులకు (మల్టీపర్పస్ వర్కర్లకు) ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో వెంకట మల్లికార్జున్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో మంచినీటి సరఫరా మరింత మెరుగుపడేలా వీరికి అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామంలో చిన్నచిన్న రిపేర్లు, బోర్ల మెయింటనెన్స్, పైప్‌లైన్ల లీకేజీ, ప్లంబింగ్ పనులు వీరు చేస్తారని ఆయన తెలిపారు.

## రామాలయ నిర్మాణానికి చేయూత

ఆర్థిక సాయం అందిస్తున్న రాజలింగం

నర్మెట, సెప్టెంబర్ 30 : మండలంలోని కన్నెబోయిన గూడెం గ్రామంలో నిర్మిస్తున్న రామాలయానికి జనగామ హమ్‌సాత్ ఫౌండేషన్ చైర్మన్ యాకూబ్‌పాషా 25 బస్తాల సిమెంట్‌ను అందించారు. తద్వారా మత సామరస్యాన్ని చాటారు. జనగామ పట్టణం హైదరాబాద్ రోడ్డులోని దర్గా అభివృద్ధికి కన్నె బోయినగూడెం మాజీ సర్పంచ్ కంతి రాజలింగం రూ.5 వేలను యాకూబ్‌పాషాకు అందించారు. ఈ సందర్భంగా యాకూబ్ పాషా మాట్లాడుతూ రామాలయ నిర్మాణంలో తాను భాగస్వామి కావడం ఆనందంగా ఉందన్నారు. మతాల కతీతంగా ఒకరినొకరు గౌరవించుకోవడం హర్షణీయమని తెలిపారు. ఈ కార్యక్రమం లో మామిండ్ల జయరాములు, రాజయ్య, పొన్నబోయిన మల్లయ్య పాల్గొన్నారు.

## హరీశ్‌రావు పర్యటనను విజయవంతం చేయాలి

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నవీన్

పాలకుర్తి రూరల్, సెప్టెంబర్ 30: రైతుల పంట రుణాలను మాఫీ చేయాలని కోరుతూ ఈ నెల 4న పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు పట్టణంలో నిర్వహించే బీఆర్‌ఎస్ రైతు స భను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ కోరారు. దీనికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హాజరవుతారని తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ బొబ్బల ఆశోక్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నాయకత్వంలో రైతు సభ నిర్వహిస్తున్నామన్నారు. 4న ఉదయం 11గంటల వరకు రైతులు, బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివచ్చి సభను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్, నాయకులు తాడెం ర వి, కడుదుల కర్ణాకర్‌రెడ్డి, ఎడవెల్లి కృష్ణ, ఎండీ సర్వర్‌ఖాన్, ఎండీ అబ్బాస్‌ఆలీ, లొం క మల్లేశ్, మామిండ్ల శోభన్‌బాబు, పుస్కూరి కళింగరావు, ధరావత్ యాకూబ్, దిండిగాల వెంకన్న, సోమ వెంకన్న, పోశాల వెంకన్న, సోమయ్య పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి రాజయ్య పరామర్శ

మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాజయ్య

లింగాలఘనపురం, సెప్టెంబర్ 30 : మండలంలోని చీటూరుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఎర్ర కుమార్ తండ్రి బుచ్చయ్య ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో సోమవారం దశదిన కర్మ ని ర్వహించగా మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్ర యాదయ్య, గట్టగల్ల శ్రీహరి, ఉడుగుల బాగ్యలక్ష్మి, బైరు యాకన్న, అంతగల్ల రాంచందర్, లొక్కుంట్ల ఆగరాజు, సోమిరెడ్డి పాల్గొన్నారు.

# సమస్యలపై మున్సిపల్ కౌన్సిల్‌లో ఏకరువు

- అధికారుల నిర్లక్ష్యంపై అధికార, విపక్ష పార్టీ సభ్యుల ఆగ్రహం
- జనగామ మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో 41 అంశాలకు ఆమోదం

కౌన్సిల్‌లో సమస్యలపై అధికారులను నిలదీస్తున్న హరిశ్చంద్రగుప్తా

జనగామ, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : వార్డుల్లో పేరుకుపోయిన ప్రజా సమస్యలు..అడుగు ముందుకు పడని అభివృద్ధి పనులపై అధికార, విపక్షాల తేడాలేకుండా అన్నిపార్టీల కౌన్సిలర్లు అధికారుల ముందు గోడు వెళ్లబోసుకున్నారు. సోమవారం చైర్‌పర్సన్ పోకల జమున అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో తొలుత కాంగ్రెస్ సభ్యుడు రాంచందర్ మాట్లాడారు. పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని మున్సిపల్ నుంచి నిధులు కేటాయిస్తే వాటిని నియంత్రించడం లేదన్నారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్రగుప్త మాట్లాడుతూ మిషన్ భగీరథ నీటి కోసం తవ్విన పైపులైన్ పనులు పూర్తయినా ప్యాచ్ వర్క్ చేయకపోవడంతో సీసీ రోడ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. వీటికి మరమ్మతులు చేయించాలన్నారు. దసరా, దీపావళి పర్వదినాల సందర్భంగా ప్రయాణికుల కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని, బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్ వరకు లోకల్ బస్సులు నడపాలని సంబంధిత అధికారులను కోరారు. గతంలో మంజూరైన అభివృద్ధి పనులను సంబంధిత కాంట్రాక్టర్ చేయడంలేదని, వెంటనే పనులు ప్రారంభించకుంటే తమపార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేయాల్సి ఉంటుందన్నారు. బీఆర్‌ఎస్ సభ్యురాలు పేర్ని స్వరూప మాట్లాడుతూ ఎజెండా అంశాలను ఇష్టానుసారంగా పొందుపరుస్తున్నారని, అభివృద్ధి పనులకు సంబంధించి గతంలో తాను అనేకసార్లు అధికారుల దృష్టికి తెచ్చినా కౌన్సిల్ ఎజెండాలో చేర్చలేదని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ సభ్యురాలు గుర్రం భూలక్ష్మి మాట్లాడుతూ తన వార్డులో అండర్‌పాస్ పనుల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అనేకసార్లు చెప్పి నిరసన తెలిపినా కూడా పనులు పూర్తిస్థాయిలో కావడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ సభ్యురాలు సుధ మాట్లాడుతూ తన వార్డులో పనిచేసే శానిటరీ కార్మికులను కలెక్టర్ కార్యాలయానికి మళ్లించడంతో పనులు కావడం లేదన్నారు. బీజేపీ సభ్యురాలు ఉడుగుల శ్రీలత మాట్లాడుతూ తన వార్డులో మురికివాడలు ఎక్కువగా ఉన్నాయని, తాగునీటి సమస్య నెలకొనడంతో మినీట్యాంక్ మంజూరు చేసి నా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదన్నారు. సభ్యుడు మల్లేశ్ మాట్లాడుతూ జవాన్ల విషయంలో సెక్షన్‌కు సంబంధం లేకుండా అనుభవంలేని వారిని నియమించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ సభ్యుడు కర్రె శ్రీనివాస్ మాట్లాడుతూ ఎజెండా పంపిన తర్వాత టేబుల్ ఎజెండాలు చాలా పొందుపర్చడం సరికాదన్నారు. మొత్తం 24 ప్రధాన ఎజెండా అంశాలు సహా 17 టేబుల్ అంశాలతో కలిపి మొత్తం 41 అంశాలను కౌన్సిల్ ఆమోదించిందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ ఇంజినీర్ మహిపాల్, మేనేజర్ రాములు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు కృషి

### ఎమ్మెల్యే కడియం శ్రీహరి

అన్నప్రాసన చేయిస్తున్న ఎమ్మెల్యే కడియ శ్రీహరి, చిత్రంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య

స్టేషన్‌ఘన్‌పూర్,సెప్టెంబర్ 30: మహిళా సాధికారత అంటే ఆర్థికంగా ఉండడమే కాదు, ఆరోగ్యంగా ఉండాలని అప్పుడే ఏదైనా సాధించవచ్చని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ మాసోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. వరంగల్ ఎంపీ కడియం కావ్యతోపాటు ఎమ్మెల్యే శ్రీహరి ము ఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సమయానికి అనుగుణంగా అందజేయాలని అంగన్‌వాడీ టీచర్లు, హెల్త్ వర్కర్లకు సూచించారు. పోషకార లోపాలను అధిగమించడానికి మహిళలకు అవగాహన కల్పించేలా కృషి చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై అవగాహన కల్పించి జాగ్రత్తలు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

**బతుకమ్మ పండుగ ఏర్పాట్ల పరిశీలన**

డివిజన్ కేంద్రంలోని దేవాదుల రిజర్వాయర్ కట్టపై బతుకమ్మ పండుగ ఏర్పాట్లను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకల నిర్వహణలో మహిళలకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆదేశించారు. కట్టపైకి వాహనాలు రాకుండా చూడాలని కోరారు.

## ప్రేమ జంటకు రక్షణ కల్పించాలి

పాలకుర్తి రూరల్, సెప్టెంబర్ 30: ప్రేమించి పెళ్లి చేసుకున్న ప్రేమజంటతోపాటు కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝూకు రజకవృత్తి దారుల సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మైలారం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఈదునూరి మదార్ మాట్లాడుతూ పాలకుర్తి మండలం కోతులబాద్‌కు చెందిన రజక కులస్థుడు చిట్యాల సతీశ్ అదే గ్రామానికి చెందిన ఎనుగు రేవతిరెడ్డి గత నెల ప్రేమ వివాహం చేసుకున్నారు. దీంతో ఆగ్రహించిన రేవతి కుటుంబ సభ్యులు సతీశ్ తల్లి నర్సమ్మతోపాటు కుటుంబ సభ్యులపై రెండు రోజుల క్రితం దాడి చేశారని వారు తెలిపారు. బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని సీపీని కోరారు. దీనిపై స్పందించిన సీపీ అంబర్‌కిశోర్‌ఝూ వెంటనే జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో మాట్లాడారని చెప్పారు. సీపీని కలిసిన వారిలో చిట్యాల ఐలమ్మ ఫౌండేషన్ అధ్యక్షురాలు చిట్యాల మంజుల, సభ్యులు చిట్యాల నర్సమ్మ, ఈదునూరి రాధిక, కంచర్ల కుమారస్వామి, పెల్లి మానస, సబిత తదితరులు ఉన్నారు.

## నేడు పాలకుర్తిలో బీఆర్‌ఎస్ విస్తృత సమావేశం

### హాజరుకానున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల, సెప్టెంబర్ 30: పాలకుర్తి మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్ హాలులో మంగళవారం ఉదయం 11 గంటలకు దేవరుప్పుల, కొడకండ్ల, పాలకుర్తి మండలాల స్థాయిలో బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ సోమవారం విలేకరులకు తెలిపారు. సమావేశానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. మండలంలోని బీఆర్‌ఎస్ వివిధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు

## సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు సాధించాలి

కోమల్లలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అబ్బయ్య

రఘునాథపల్లి, సెప్టెంబర్ 30 : సేంద్రియ ఎరువుల వినియోగంతో పత్తిలో అధిక దిగుబడులు సాధించవచ్చని దేశ్ పాండే ఫౌండేషన్ క్షేత్ర సహాయకుడు గంపల అబ్బయ్య అన్నారు. సోమవారం మండలంలోని కోమల్లలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటల సాగులో రసాయన ఎరువులు ఎక్కువ మోతాదులో వాడడంతో భూమి కలుషితమై తక్కువ దిగుబడులు వస్తున్నాయని తెలిపారు. ఆవు మూత్రం, పొగాకు, వెల్లుల్లి, వేపాకు, పచ్చిమిర్చితో తయారు చేసిన అగ్ని అస్త్రం మందును పత్తి చేనులో పిచికారీ చేస్తే గొంగళి పురుగు, కాయ తొలిచే పురుగులను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వీరబోయిన కొమురయ్య, బొల్లపల్లి కిష్టయ్య, నీల సంపత్, ఎర్ర కుమారస్వామి, మంద రాములు, బాల్నె పరశురాములు, ఆకుల రాజు, బొల్లపల్లి సత్తయ్య, మంద మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

## న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలి

నిరసన వ్యక్తం చేస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 30 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కోర్టు ఎదురుగా బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రరుషి మాట్లాడుతూ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. న్యాయవాదుల రక్షణ చట్టం, 41 (ఎ) ఆఫ్ సీఆర్‌పీసీ/35 బీఎన్‌ఎస్‌ఎస్ అమెండ్‌మెంట్, టెన్యూర్ పీపీల నియామకం పాతపద్ధతిలో నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నక్క సిద్ధులు, న్యాయవాదులు లక్ష్మణ స్వామి, మంచాల రవీందర్, సత్తయ్య, ఎల్లారెడ్డి, శంకర్, రామకృష్ణ, శ్రీనివాస్, దాసు, సత్తయ్య, దయాకర్‌రెడ్డి, అశోక్, స్వప్న, రేఖ, సంగీత, సౌమ్య, రాంరెడ్డి, మల్లేశం, పరశురాములు, కిరణ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 30 : టీజీ డీఎస్సీ 2024 ఉపాధ్యాయ నియామక పరీక్ష తుది ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఈ క్రమంలో జిల్లాలో అర్హత సాధించిన అభ్యర్థుల ఎంపిక కోసం వివిధ సబ్జెక్టుల వారీగా 1:3 నిష్పత్తిలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను మంగళవారం నుంచి ఈ నెల 3వ తేదీ వరకు స్థానిక ప్రెస్టన్ హైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు డీఈవో రాము తెలిపారు. తమ మొబైల్‌కు మెసేజ్ వచ్చిన అభ్యర్థులు వారి ధృవీకరణ పత్రాలు, రెండు సెట్ల జిరాక్స్‌లు గెజిటెడ్ అధికారి సంతకంతో అటెస్టేషన్ చేయించుకొని వెరిఫికేషన్‌కు హాజరుకావాలని ఆయన సూచించారు. అభ్యర్థుల వివరాలు సోమవారం సాయంత్రం నుంచి వెబ్‌సైట్ ఐడీలో అందుబాటులో ఉంటాయన్నారు.

## అనుమతిలేని ఇసుక ట్రాక్టర్ సీజ్

రఘునాథపల్లి, సెప్టెంబర్ 30: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్‌యాదవ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నిడిగొండకు చెందిన కానుకుట్ల లక్ష్మణ్ గ్రామంలోని వాగు నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తుండడంతో సోమవారం తనిఖీ చేసి సీజ్ చేశారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలించడం నేరమని, దీనిని అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

గాయపడిన భూక్యా హర్య

తరిగొప్పుల, సెప్టెంబర్ 30: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని వాచ్య వెంకట్‌తండా శివారు నాన్యతండాకు చెందిన భూక్యా హర్య కూరగాయలు విక్రయించేందుకు సోమవారం టీవీఎస్ ఎక్సెల్‌పై మండల కేంద్రానికి వచ్చాడు. ఈ క్రమంలో హుస్నాబాద్ నుంచి జనగామ వైపు వేగంగా వెళ్తున్న కారు ఢీకొంది. హర్యకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స కోసం జనగామలోని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మోదీ పాలన

ర్యాలీలో సీపీఎం నాయకులు అబ్బాస్, విజేందర్

బచ్చన్నపేట, సెప్టెంబర్ 30 : కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతూ సామాన్య, మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నదని సీపీఎం రాష్ట్ర నాయకుడు అబ్బాస్ ఆరోపించారు. సోమవారం మండలంలోని చిన్నరామన్‌చర్లలో పార్టీ మహాసభ జరిగింది. అబ్బాస్ మాట్లాడుతూ ప్రధానిగా మోదీ అధికారంలో ఉన్నంత కాలం ఆదానీ, అంబానీలే మరింత అభివృద్ధి చెందుతారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో నిత్యావసర వస్తువుల ధరలు మరింతగా పెరిగాయని తెలిపారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అబ్బాస్ డిమాండ్ చేశారు. పేదలకు రేషన్‌కార్డులు అందించాలన్నారు. జిల్లా కమిటీ సభ్యులు చుంచు విజేందర్, మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్, నాయకు లు ఎల్లయ్య, ఆశోక్, బాల్‌నర్సయ్య, ఐలయ్య, స్వప్న, శైలజ, నర్సింహస్వామి, అంజన్‌కుమార్, మనోహర్, కనకయ్య, దయామణి, రవి, భిక్షపతి, మల్లేశ్ పాల్గొన్నారు.

## లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని శిక్షించాలి

### కురుమ సంఘం నేత జాయ్ మల్లేశ్

జనగామ, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జాయ్ మల్లేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం చలో గురువన్నపేటకు పిలుపునిస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కురుమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మం డలం గురువన్నపేటలో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలన్నారు. మానవ మృగాన్ని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి కురుమ సంఘం అండగా ఉం టుందని, వారి కుటుంబానికి న్యాయం జరిగేలా పోరాటం చేస్తామని మల్లేశ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంగ రామకృష్ణ, దేవర సత్యనారాయణ, రేవెల్లి చంద్రం, బండ ప్రభాకర్, నో ముల నర్సింహులు, మంగ లక్ష్మణ్, బేడిదె వినయ్, కేమిడీ నరహరి, మంగ నరేశ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాయ్ మల్లేశ్

విద్యార్థులకు క్రీడా దుస్తులు అందిస్తున్న కృష్ణవేణి

## విద్యార్థులకు దాతల చేయూత అభినందనీయం

లింగాలఘనపురం, సెప్టెంబర్ 30 : విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎంఈవో పడాల విష్ణుమూర్తి అన్నారు. సోమవారం మండలంలోని కుందారం ప్రభుత్వ పాఠశాలలో బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు కృష్ణవేణి తన సొంత ఖర్చులతో విద్యార్థులకు క్రీడా దుస్తులను అందించారు. హెచ్‌ఎం బిట్ల రవిశంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విష్ణుమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయురాలు కృష్ణవేణి పాఠశాలలోని 93 మంది విద్యార్థులకు రూ.35 వేలు వెచ్చించి క్రీడా దుస్తులను కొనుగోలు చేసి ఇవ్వడం హర్షణీయమన్నారు. సర్కారు ప్రోత్సాహానికితోడు దాతలు ముందుకొచ్చి విద్యార్థులకు తమవంతు సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిట్ల రవిశంకర్, విద్యాకమిటీ చైర్‌పర్సన్ సునీత, ఉపాధ్యాయులు శ్రీనివాసాచారి, వెంకటేశ్వర్లు, రజిత, రమాదేవి, రాములు, సుధారాణి పాల్గొన్నారు.

## చేనేత కార్మికులను ఆదుకోవాలని వినతి

రఘునాథపల్లి, సెప్టెంబర్ 30: చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకుడు రాపోలు రామ్మూర్తి కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందజేశారు. తరతరాలుగా చేనేత వృత్తిపై ఆధారపడిన అనేక మంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి సురేఖ చేనేత కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తనవంతు సాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఇందుకోసం ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారని రామ్మూర్తి వివరించారు.

## డీఎస్సీ ఫలితాల్లో సంధ్య ప్రతిభ

### జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం

సంధ్య

దేవరుప్పుల, సెప్టెంబర్ 30: డీఎస్సీ ఫలితాల్లో గోపగోని సంధ్య జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. నర్మెటకు చెందిన సంధ్య మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో (ఐఈఆర్‌పీ) ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల బోధకురాలుగా విధులు నిర్వర్తిస్తూ రెండు విభాగాల్లో ప్రథమ స్థానం సాధించింది. ప్రస్తుతం సమగ్ర శిక్ష ఉద్యోగిగా పని చేస్తున్న సంధ్య డీఎస్సీ ఎంట్రెన్స్ రాసింది. స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్), సెకండరీ గ్రేడ్ టీచర్(స్పెషల్ ఎడ్యుకేషన్) రెండు విభాగాల్లో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో ఉత్తీర్ణత సాధించడం విశేషం. సంధ్యను మండల విద్యాశాఖాధికారి గుంటకండ్ల కళావతి అభినందించారు. ఎమ్మార్సీ సిబ్బంది గోలి రవీందర్‌రెడ్డి, నర్సింహులు, యాకస్వామి, యాకయ్య, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## నరేశ్‌ను వరించిన రెండు పోస్టులు

నరేశ్

డీఎస్సీ ఫలితాల్లో దేవరుప్పులకు చెందిన కారుపోతుల నరేశ్ జిల్లా టాపర్‌గా నిలిచారు. పీడీ, పీఈటీ ఉద్యోగాలు సాధించి గ్రామానికే వన్నె తెచ్చారు. కారుపోతుల రాజయ్య-లక్ష్మి దంపతుల కుమారుడైన నరేశ్ ఎంపీడీ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో పనిచేస్తూనే డీఎస్సీ ఎంట్రెన్స్ రాశాడు. ఫిజికల్ డైరెక్టర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా రెండు ఉద్యోగాలను సాధించడంతో గ్రామస్తులు అభినందించారు

శామీర్‌పేటలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం : కలెక్టర్

జనగామ, సెప్టెంబర్ 30 : బాలింతలు, చిన్నారులు రక్తహీనత నుంచి బయటపడాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం మండలంలోని శామీర్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం చేసి సారె అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐసీడీఎస్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పౌష్టికాహారం ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీ కార్యదర్శుల సహాయంతో చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడాలని ఆయన సూచించారు. ప్రభుత్వ లక్ష్యానికనుగుణంగా ఐసీడీఎస్ సిబ్బంది పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, డీడబ్ల్యూవో జయంతి, జడ్పీ సీఈవో సరిత, డీఎంహెచ్‌వో రవీందర్ గౌడ్, డీఆర్డీవో వసంత, డీపీవో స్వరూప, జేనేత శాఖ జాయింట్ డైరెక్టర్ చౌడేశ్వరి పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలను తొలగించాలి

పాలకుర్తి,సెప్టెంబర్ 30: అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు హైదరాబాద్ తరహాలో హైడ్రా లాంటి వ్యవస్థను మండలంలోనూ తీసుకురావాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేశ్‌రాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో గుమ్మడిరాజుల సాంబయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరారు. ప్రభుత్వ భూముల్లో నిరుపేదల నివాసాలుంటే వారికి ప్రత్యామ్నాయం చూపాలన్నారు. గ్రామ స్థాయిలో చెరువులు, కుంటలు ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని వాటిని పరిరక్షించేందుకు సమగ్రసర్వే చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్లపల్లి మల్లయ్య, జీడీ సోమయ్య, పోలాస సోమయ్య, కొనకటి కళింగరాజు పాల్గొన్నారు.

## గంగిశెట్టి ప్రమోద్‌కుమార్‌కు సన్మానం

ప్రమోద్‌కుమార్‌కు నియామక పత్రం ఇస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

జనగామ, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్‌కుమార్‌కు రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సంఘ భవనంలో 2024-26 సంవత్సరానికిగాను జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రమోద్‌ను రాష్ట్ర మహాసభ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆగిరి వెంకటేశ్, జనగామ పట్టణ ప్రముఖులు పజ్జూరి గోపయ్య, గట్టు వెంకటేశ్వర్లు, బెజుగం భిక్షపతి పాల్గొన్నారు.

## సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 30 : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై తలెత్తిన వివాదాన్ని సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ఆందోళన నిర్వహించారు. అనంతరం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను కలిసి వినతిపత్రం సమర్పించారు. వీహెచ్‌పీఎస్ నాయకులు మాట్లాడుతూ హిందూ దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనం వైదొలగాలని సూచించారు. పీఠాధిపతులు, స్వామీజీలు, ఆధ్యాత్మికవేత్తలతో ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మంచాల రవీందర్, ఉపాధ్యక్షుడు పగిడిపాటి నరహరి, కోశాధికారి నర్సింహరావు, నీలం స్వామి, రామకృష్ణ, బాలనారాయణ, కుమారస్వామి, సదానందచారి, నగేశ్, ముక్క స్వామి, అజయ్, తిరుమల చారి, కుమారస్వామి, మల్లేశం పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

PLOT FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-326316

CHANGE OF NAME
I, BURU LAXMI (New Name), Previously called NARAGONI SWARNALATHA (Old Name), and R/o H.No. 55-3-192/1/E, Sai Nagar Colony, Bheemaram Vill, Hasanparthy Mdl, Hanumakonda Dist - 506015, T.S., India and solemnly declare

CHANGE OF NAME
★I, AMENA PARVEEN W/o INKESHAF AHMED, R/o. H.No. 4-8-18, Opp. Police Station, Hanamkonda, Warangal - 506001, Telangana. Have changed my name to AMEENA PARVEEN and solemnly declare.
NTW-000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565